epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : మంగళవారం - సెప్టెంబర్ 05- 2023 - పేజీలు : 3

## జి 20 సదస్సులో చైనా ప్రీమియర్ పాల్గొంటారు

### - బీజింగ్ ప్రకటన



**టీ మీడియా, సెప్టెంబర్ 4,బీజింగ్ :** జి20 సమావేశానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకావడం లేదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. "భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు న్యూఢిల్లీలో జరగనున్న 18వ జి20 సదస్సుకు స్టేట్ కౌన్సిల్ ప్రీమియర్ లీ కియాంగ్ హాజరవుతారు" అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ ఆ ప్రకనటలో పేర్కొన్నారు. అయితే జిన్‌పింగ్ గైర్హాజరు కావడానికి గల కారణం వెల్లడించలేదు.అలాగే ఈ వారం చివరలో ఇండోనేషియాలో జరగనున్న అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్ నేషన్స్ మరియు ఈస్ట్ ఆసియా సదస్సుకు కూడా జిన్‌పింగ్ హాజరుకావడం లేదని మీడియా తెలిపింది. ఈ సమావేశానికి కూడా లీ కియాంగ్ చైనా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు వెల్లడించింది.రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా జి 20 సమావేశానికి హాజరుకాలేకపోతున్నట్లు గతవారం ప్రధాని మోడీకి ఫోన్‌లో వెల్లడించిన సంగతి తెలిసిందే. రష్యా ప్రతినిధిగా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌ను పంపాలని భావిస్తున్నట్లు తెలిపారు.

## టీచర్లందరికీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు



**టీ మీడియా, సెప్టెంబర్ 4,హైదరాబాద్:** ఉపాధ్యాయుల దినోత్సవం ( సెప్టెంబర్ 5) సందర్భంగా టీచర్లందరికీ సీఎం కేసీఆర్ శు భాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, జ్ఞానాన్ని పెంపొందించి.. లక్ష్యం పట్ల వారికి స్పష్టమైన అవగాహనను కలిగించి, వారిని కార్యసాధకులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదనీ సీఎం అన్నారు. మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదే వోభవ అనే సూక్తి తల్లిదండ్రుల తర్వాత గురువుకు ఉన్న ప్రాధాన్యతను తెలియచే స్తున్నదని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం తో పాటు.. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి, అభివృద్ధికి సమర్ధవంతమైన కార్యాచరణను అమలుచేస్తున్నదని సీఎం కేసీఆర్ తెలిపారు. గురుకుల విద్యలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ రేపటి తరాన్ని తీర్చిదిద్దడంలో ముందంజలో ఉందన్నారు. గుణాత్మక విద్యను అందిస్తూ చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణ సత్ఫలితాలను ఇస్తున్నద న్నారు. తెలంగాణ ప్రభుత్వ విధానాలతో నేడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు చదువుల్లోనూ, క్రీడల్లోనూ జాతీయ, అంతర్జాతీ య స్థాయిలో రాష్ట్ర ఖ్యాతిని చాటుతున్నారని గుర్తు చేశారు. విద్యారంగ ప్రగతి పట్ల తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న అంకితభావానికి, చిత్తశుద్ధికి ఇది నిదర్శమని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల మధ్య టికెట్ వార్

### - ఇద్దరు నేతల ప్రచారంతో క్యాడర్‌లో అయోమయం



**టి మీడియా, సెప్టెంబర్ 4, నిజామాబాద్ :** జిల్లా బాల్కొండలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి- ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్ రెడ్డి మధ్య టికెట్ ఫైట్.. స్ట్రీట్ ఫైట్‌ను తలపిస్తోందట. డీసీసీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి చాలా రోజులుగా బాల్కొండ సీటు పై కన్నేసి.. గడప గడపకు కాంగ్రెస్ పేరుతో.. ప్రజల్లోకి వెళ్తున్నారు. అక్కడి నుంచి గెలిచిన ఓ మాజీ ఎమ్మెల్యే ఈ సారి తాను పోటీ చేయలేనని చేతులెత్తేశారు. జాగృతిలో కీలక నేతగా ఉన్న ఆరేంజ్ ట్రాపెల్స్ అధినేత ముత్యాల సునీల్ రెడ్డి గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేశారు. రెండో స్దానంలో నిలిచారట. ఈ ఎన్నికల్లో బీజేపీలో చేరాలని చివరి నిమిషం వరకు ప్రయత్నాలు చేశారు.. ఓ అగ్రనేత అడ్డు పడటంతో ఆయన బీజేపీలో చేరికకు బ్రేకులు పడ్డాయి. దీంతో ఆయన కాంగ్రెస్ గూటిలో చేరి.. తానే అభ్యర్దినంటూ ప్రచారం మొదలెట్టేశారుసునీల్ రెడ్డి చేరికను డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ముందు నుంచి వ్యతరేకించారు. పీసీసీ నిర్ణయం మేరకు సునీల్ రెడ్డి పార్టీలో చేరిక అనివార్యం కావడంతో.. ఇప్పుడు టికెట్టు కోసం మాత్రం బెట్టు వీడటం లేదట మోహన్ రెడ్డి. డీసీసీ అధ్యక్షునిగా ఉన్న తాను బాల్కొండ బరిలో ఉంటానని అదిష్ఠానానికి సంకేతాలు పంపారు. అదే స్దానం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ లో చేరిన సునీల్ రెడ్డి నేను గెలుపు గుర్రాన్ని అంటున్నారు. దీంతో ఇద్దరు నేతలు వేర్వేరుగా కార్యక్రమాలు చేస్తున్నారు. రెండు వర్గాలుగా పార్టీ నేతలు చీలిపోయారట. సై అంటే సై అంటూ పోటీకి రెడీ అవుతున్నారు.

టికెట్ నాదే, డిసిసి అధ్యక్షుడు మానాల : డీసీసీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి రేవంత్ వర్గంలో ఉన్నారు. ఆయనకు బాల్కొండ టికెట్టు దాదాపుగా ఖరారు అనే సమయానికి.. ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్ రెడ్డి పార్టీలో చేరారు. దీంతో హస్తం పార్టీలో కుమ్ములాటలు మొదలయ్యాయు. బాల్కొండ టికెట్టు ను ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్ రెడ్డి- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ఆశిస్తున్నారు. ఇద్దరు నేతలు టికెట్టు విషయంలో తగ్గేదేలే అంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో ఇద్దరు కలిసి ఉంటున్నా.. ఎడముఖం- పెడముఖంలా ఉంటున్నారు. మోహన్ రెడ్డిని బుజ్జగించేందుకు ఓ సీనియర్ నేత రంగంలోకి దిగినా.. పోటీ చేయడం పక్కా అని చెప్పేశారు. ఇటు సునీల్ రెడ్డి గత ఎన్నికల్లో రెండో స్దానంలో నిలిచానని.. ఈ సారి గెలుపు గుర్రం తానేనని చెబుతున్నారు.

## దేశం మణిపూర్, హర్యానాలాగా మారకుండా ఉండాలంటే

### - ఎం.కె. స్టాలిన్



**టి మీడియా, సెప్టెంబర్ 4, చెన్నై :** మోడీ ప్రభుత్వంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష కూటమి ఇండియా విజయం సాధించి తీరాలని లేకుంటే.. దేశమంతా మణిపూర్, హర్యానాలాగా తగలబడిపోతుందని అన్నారు. 'స్పీకింగ్ ఫర్ ఇండియా' అనే పాడ్‌కాస్ట్‌లో ఆయన బిజెపిపై విమర్శలు గుప్పించారు. సోమవారం ఉదయం ప్రసారమైన ఈ ఎపిసోడ్ తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషలలో ప్రసారమౌతోంది. గత 9 ఏళ్లలో సామాజిక సంక్షేమానికి సంబంధించి బిజెపి ఎన్నికలకు ముందు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని అన్నారు. బిజెపి వాగ్దానం చేసినట్లుగా ఒక్కొక్కరికి రూ. 15 లక్షలు ప్రజలందరి ఖాతాల్లోనూ జమ కాలేదని, రైతుల ఆదాయం రెట్టింపు కాలేదని, రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించలేదని అన్నారు.మత విద్వేషాల ముసుగులో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను తన కార్పొరేట్ స్నేహితులకు దోచిపెడుతోందని మండిపడ్డారు. ఎయిర్ ఇండియా, విమానాశ్రయాలు, ఓడరేవులు బిజెపికి సన్నిహితంగా ఉండే ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని కప్పిపుచ్చేందుకు పలు రాష్ట్రాల్లో కుల, మతవిద్వేషాలను రెచ్చగొడుతోందని ధ్వజమెత్తారు. 2002లో గుజరాత్‌లో నాటిన ద్వేషం మణిపూర్, హర్యానాకు విస్తంచిందని అన్నారు.భారతదేశం మొత్తం మణిపూర్, హర్యానాగా మారకుండా ఉండాలంటే ప్రతిపక్ష కూటమి ఇండియా కచ్చితంగా విజయం సాధించితీరాలని అన్నారు. భిన్న సంస్కృతులతో కూడిన భారతదేశ వైవిధ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, మత సామరస్యం, ఫెడరలిజం, లౌకిక విధానాలు, సోషలిజం పునరుద్ధరణ కోసమే ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు.

## భగ్గుమంటున్న నిత్యావసర ధరలు




# ఉత్తరప్రదేశ్‌లో ఉపఎన్నిక

### - ఇండియా' అలియెన్స్‌కు తొలి పరీక్ష



**టీ మీడియా, సెప్టెంబర్ 4,డిల్లీ :** మరికొన్ని నెలల్లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడేందుకు 28 విపక్ష పార్టీలతో కూడిన ఇండియా కూటమి ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇక భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో సాధ్యమైనంతవరకు కలిసికట్టుగా పోరాడతామని ఆ కూటమి ఇటీవలే ప్రకటించింది. అయితే ఈ నేపథ్యంలోనే విపక్ష కూటమికి ఉప ఎన్నికల రూపంలో మొదటి పరీక్ష ఎదురుకానుంది. ఇక వివరాల్లోకి వెళ్తే ఉత్తరప్రదేశ్‌లోని ఘోసీ అనే అసెంబ్లీ స్థానానికి సెప్టెంబర్ 5 తేదీన ఉప ఎన్నిక జరగనుంది. అయితే బీజేపీ.. ఇండియా కూటమి నేరుగా పోటీ పడుతున్న మొదటి ఎన్నిక కూడా ఇదే. దీంతో ఈ అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరో విషయం ఏంటంటే ఘోసి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా గెలిచినటువంటి దరా సింగ్ చౌహాన్ ఇటీవలే పార్టీ మారారు. అయితే ఆయన సమాజ్‌వాద్ పార్టీని వీడి.. బీజేపీలో చేరాడు. దీంతో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామ చేశారుఅందుకే ఇక్కడ ఉపఎన్నికల అనివార్యమైపోయింది. ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున దరా సింగ్ చౌహాన్ పోటీలోకి దిగిపోయాడు. అయితే ఈ దరా సింగ్ చౌహాన్‌ను ఎదుర్కోవడానికి సమాజ్‌వాది పార్టీ సుధాకర్ సింగ్‌ను బరిలోకి దించింది. మరో విషయం ఏంటంటే విపక్ష కూటమి అయిన ఇండియాలో సమాజ్‌వాదీ పార్టీ కూడా ఉన్న విషయం తెలిసిందే. అలాగే ఈ ఘోసీ ఉప ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి అయిన సుధాకర్ సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, సీపీఎం, ఆప్, ఆర్ఎల్‌డీ సహా పలు పార్టీలు ఇప్పటికే మద్దతు ప్రకటించేశాయి. మరోవైపు అటు బహుజన్ సమాజ్ పార్టీ కూడా ఈ ఉప ఎన్నిక పోరుకు అభ్యర్థిని నిలబెట్టకుండా దూరంగా ఉంది. దీంతో ఈ ఎన్నిక బీజేపీ, ఇండియా కూటమిల మధ్య ద్విముఖ పోరుగా మారిపోయింది. అయితే ఈ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు మొత్తం 10 మంది పోటీలో ఉన్నారు.కానీ ఈ ఉపఎన్నికల్లో బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీ మధ్యే గట్టి పోటీ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా ఆ ఘోసి నియోజకవర్గంలో 4 లక్షల 38 వేల మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోనున్నారు. అయితే మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఇక సెప్టెంబర్ 8వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. దీంతో ఆరోజున ఎవరు గెలవనున్నారో తెలనుంది. మొత్తం 403 స్థానాలున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో అధికార బీజేపీకి స్పష్టమైన ఆధిక్యత ఉంది. అయితే ఈ ఒక్క ఉప ఎన్నిక వల్ల ప్రభుత్వంలో ఎలాంటి మార్పు ఉండదు. కానీ 2024లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జట్టు కట్టినటువంటి విపక్షాలకు ఇది ముఖ్యమైన పరీక్షే. అయితే ఈ ఎన్నిక ఫలితాలు.. లోక్‌సభ ఎన్నికలపై కూడా ప్రభావాన్ని చూపుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# సన్ మిషన్ విజయవంతంలో భాగమైన కేరళ పిఎస్‌యులు

**టి మీడియా, సెప్టెంబర్ 4,తిరువనంతపురం :** అంతరిక్ష పరిశోధనలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) వరుస విజయాలు సాధిస్తోంది. మొన్న చంద్రయాన్ -3, నిన్న సన్ మిషన్ ఆదిత్య ఎల్ - 1 ప్రయోగాలు విజయవంతమయ్యాయి. ఈ విజయంలో కేరళ పిఎస్‌యుల భాగస్వామ్యం కూడా ఉంది. కేరళకు చెందిన నాలుగు ప్రభుత్వ రంగ సంస్థలు కెల్ట్రాన్, స్టీల్ అండ్ ఇండిస్ట్రీయల్ ఫోర్జింగ్స్ లిమిటెడ్ (ఎస్ఐఎఫ్ఎల్), ట్రావెన్‌కోర్ కొచ్చిన్ కెమికల్స్ (టిసిసి), కేరళ ఆటోమొబైల్స్ లిమిటెడ్ (కెఎఎల్) ఈ నాలుగు పిఎస్‌యులు దేశీయంగా అభివృద్ధి చేసి తయారుచేసిన వివిధ ఉత్పత్తులను ఆదిత్య ఎల్ -1 మిషన్‌లో ఉపయోగించారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి పి. రాజీవ్ తెలిపారు. తాజాగా ఆయన చారిత్రాత్మక ప్రయోగాలైన చంద్రయాన్ - 3, ఆదిత్య ఎల్ -1 ప్రయోగాలు విజయవంతమవడానికి కేరళ పిఎస్‌యులు ఎంతో దోహదపడ్డాయని ఆయన తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపారు. ఆదిత్య ఎల్ -1 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపేందుకు ఉపయోగించే పిఎస్ఎల్వి-సి57 లాంచ్ వెహికల్‌లో కేరళ స్టేట్ ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (కెల్ట్రాన్) తయారుచేసిన 38 ఎలక్ట్రానిక్ మాడ్యూళ్లను ఉపయోగించినట్లు మంత్రి రాజీవ్ తెలిపారు. దానితోపాటు మిషన్‌కు అవసరమైన వివిధ రకాల ఎలక్ట్రానిక్స్ మోడళ్లకు టెస్టింగ్ సపోర్టును కూడా కెల్ట్రాన్ అందించిందని రాజీవ్ చెప్పారు. ఆదిత్య ఎల్ -1 లాంచ్ వెహికల్‌లోని వివిధ దశలకు సంబంధించిన ఫోర్జింగ్‌లను ఎస్ఐఎఫ్ఎల్ దేశీయంగా అభివృద్ధి చేసినట్లు ఆయన తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. లాంచ్ వెహికల్ ప్రొపెల్లర్ ట్యాంక్, ఇంజన్ రాకెట్ బాడీ కోసం అనేక ఇతర ఫోర్జింగ్‌లు, వాటి భాగాలను కూడా ఎస్ఐఎఫ్ఎల్ అభివృద్ధి చేసింది. ఈ మిషన్‌లో కెల్ట్రాన్, ఎస్ఐఎఫ్ఎలతోపాటు టిసిసి కూడా కీలక పాత్ర పోషించిందని మంత్రి చెప్పారు. సన్ మిషన్ ప్రాజెక్టుకు సంబంధించిన 150 మెట్రిక్ టన్నుల సోడియం క్లోరేట్ క్రిస్టల్స్‌ను ప్రభుత్వ యాజమాన్యంలోని కెమికల్ కంపెనీ సరఫరా చేసింది. అవి మాత్రమే కాకుండా రాకెట్ యొక్క ఉపగ్రహ విభజన వ్యవస్థకు అవసరమైన వివిధ భాగాలను కెఎఎల్ సరఫరా చేసిందని రాజీవ్ తన పోస్ట్‌లో తెలిపారు.



కాగా, ఆదిత్య ఎల్ -1 ప్రయోగానికి మాత్రమే కాదు.. చంద్రయాన్ -3 మిషన్ కూడా కేరళ పిఎస్‌యుల సహకారం ఉందని మంత్రి రాజీవ్ తెలిపారు. చంద్రయాన్ -3 మిషన్‌లో కేరళకు చెందిన ఆరు ప్రభుత్వ రంగ సంస్థలు, 20 ప్రైవేట్ కంపెనీలు భాగస్వామ్యమయ్యాయి. కేరళకు చెందిన కెల్ట్రాన్, కెఎంఎంఎల్, ఎస్ఐఎఫ్ఎల్, టిసిసి, కెఎఎల్, స్మాల్ ఇండిస్టీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లు (ఎస్ఐడిసిఓ) చంద్రమిషన్‌కు సహకరించాయి. కెఎంఎంఎల్ చంద్రయాన్ 3 మిషన్ యొక్క ఇంజన్ భాగాల కోసం కీలకమైన టైటానియం స్పాంజ్ మెటల్‌ను సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషించింది. దేశంలో టైటానియం సరఫరా చేసే ఏకైక సంస్థ కెఎంఎంఎల్‌నే కావడం విశేషం

## అత్యంత అవినీతిపరుడు చంద్రబాబు

### - మాజీ మంత్రి కొడాలి నాని



**టీ మీడియా, సెప్టెంబర్ 4,అమరావతి:** దేశంలోనే అత్యంత అవినీతిపరుడు చంద్రబాబునాయుడు అని మాజీ మంత్రి కొడాలి నాని విమర్శించారు. సోమవారం ఆయన గుడివాడలో మీడియాతో మాట్లాడారు. ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ దోపీడీకి పాల్పడే వ్యక్తి చంద్రబాబు అంటూ ఆయన ఆరోపించారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకొంటూ తన దోపీడీని చంద్రబాబు కొనసాగిస్తున్నాడన్నారు. ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడాన్ని చంద్రబాబే ప్రారంభించారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు తరహాలో ఖర్చు చేస్తే 2014లోనే తమ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేదని కొడాలి నాని అభిప్రాయపడ్డారు. 1999లో ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్ధికి చంద్రబాబు కోటి రూపాయాలు ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఆ తర్వాతి ఎన్నికల్లో డబ్బులు పెంచుకుంటూ పోయారన్నారు.వచ్చే ఎన్నికల్లో కూడ వేల కోట్లు ఖర్చు చేసి విజయం సాధించాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఐటీ శాఖ చంద్రబాబుకు నోటీసులపై కూడ ఆయన స్పందించారు. రూ. 118 కోట్లు రికార్డు అనేది చాలా తక్కువ అని కొడాలి నాని చెప్పారు. చంద్రబాబు లక్ష కోట్లను దోచుకున్నారని ఆయన ఆరోపించారు.రెండు ఎకరాల చంద్రబాబుకు రెండు వేల కోట్లు ఎలా సంపాదించారని ఆయన ప్రశ్నించారు.

## మల్లయ్య యాదవ్ గెలుపును ఆపడం ఎవరి వల్ల కాదు

### - కేశబోయిన మురళీ కృష్ణ



**టీ మీడియా, సెప్టెంబర్ 4, నడిగూడెం :** కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ రెండోసారి గెలుపు ను ఆపటం ఎవరి వల్ల కాదని ఓయూ బి ఆర్ ఎస్ వి నాయకులు కేశబోయిన మురళీ కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గానికి చెందిన వ్యక్తిని రెండోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత కొంత మంది అగ్రవర్ణాలకు చెందిన నాయకులు అడ్డుకుంటున్నారని అది వారి వల్ల కాదని తెలిపారు. అగ్రవర్ణాల నాయకులకు కొంత మంది కావాలని వంత పాడుతున్నారని తెలిపారు. ఒక బహుజన బిడ్డగా పూర్తి స్థాయిలో నియోజకవర్గంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి పేదవాడి ఆకలి తెలిసిన వ్యక్తికి అడ్డుపడటం తగదన్నారు. కొంత మంది నాయకులు కావాలని ఆడంబరాలు చేస్తున్నారే తప్ప వాళ్లని ఎవరు పట్టించుకోవడం లేదన్న సంగతి తెలుసుకోవడం మంచిదన్నారు. నియోజకవర్గ ప్రజలు మల్లన్న మళ్లీ గెలవాలని కోరుకుంటున్నారని తెలిపారు. కేవలం ప్యాకేజీల కోసం మాత్రమే ప్యాకేజి నాయకులు లాబింగ్ చేస్తున్నారని వారికి కొంతమంది వత్తాసు పలుకుతున్నారని అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. విలేకరుల సమావేశంలో వారితో పాటు బి ఆర్ ఎస్ వి మండల అధ్యక్షులు మేకల వీరేశం, ప్రధాన కార్యదర్శి కాసాని వెంకటేష్, బి ఆర్ ఎస్ వి నాయకులు పందిటి నవీన్, సందీప్, ఫయాజ్, నమృత్ లు పాల్గొన్నారు.

## మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక చేయూత

### - వెంకట్ గౌడ్



**టీ మీడియా, సెప్టెంబర్ 4, నడిగూడెం :** నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన కలకొండ గోపాలస్వామి తండ్రి వెంకన్న అనే వ్యక్తి బ్రతుకు తెరువు కోసం హైదరాబాదులో ఉంటు బైక్ ప్రమాదానికి గురై ఇటీవల అకాల మరణం చెందిన విషయం తెలుసుకొని జివిన్సి విక్టరీ ఫౌండేషన్ చైర్మన్ వెంకట్ గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి ఏ ఆపద వచ్చిన వెన్నంటి ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వారి వెంట ఫౌండేషన్ ఇన్చార్జి నందిగామ రామారావు సభ్యులు పోలంపల్లి నరసింహారావు గ్రామస్తులు కలకొండ సాల్మన్, ఉప్పలయ్య, యేసు, రాజు, నవీన్ జొన్నలగడ్డ వీర గోవిందు, నాగేశ్వరరావు, కనకం నాగరాజు రాజు, ఉపేందర్ రాము, పరమయ్య, మొలుగూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కావేరీ నదీ జలాల వివాదంపై స్పందించిన కర్ణాటక డిప్యూటీ సిఎం



**టి మీడియా, సెప్టెంబర్ 4, బెంగళూరు :** కావేరీ నదీ జలాల వివాదంపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కోర్టులో పోరాటం చేస్తున్నామని అన్నారు. తమ రైతులను ఎలా రక్షించుకోవాలో తమకు తెలుసునని చెప్పారు. బిజెపి, జెడిఎస్ రాజకీయాలకు పాల్పడుతున్నాయని, వారు 25,000 క్యూసెక్కుల నీటిని డిమాండ్ చేస్తున్నారని, అయితే తాము 3,000 క్యూసెక్కుల నీరు ఇచ్చేందుకు ఆమోదించామని అన్నారు. అయితే 5,000 క్యూసెక్కులు ఇవ్వాలని కోర్టు ఆదేశించిందని, ఈ అంశం కోర్టులో ఉందని అన్నారు. వర్షాలు లేనందున నీటిని తగ్గించాలని కోర్టుకి విజ్ఞప్తి చేశామని చెప్పారు. కర్ణాటకలోని రిజర్వాయర్ల నుండి రోజుకి 24,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలంటూ తమిళనాడు ప్రభుత్వం కోర్టుని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తమిళనాడు ప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరిస్తూ.. కర్ణాటక ప్రభుత్వం కూడా గతవారం ఓ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. మిగులు జలాలు ఉన్నప్పుడు తమిళనాడు అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని, అయితే ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదైందని పేర్కొంది.

## ఎటిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాపై మణిపూర్ ప్రభుత్వం కేసు




**టి మీడియా, సెప్టెంబర్ 4,ఇంఫాల్ :** మీడియా గొంతు అణచివేసేందుకు బిజెపి నేతృత్వంలోని మణిపూర్ ప్రభుత్వం యత్నిస్తోంది. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ)కి చెందిన నిజ నిర్ధారణ బృందంపై సోమవారం మణిపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) చట్టంలోని 66ఎ కింద ఇజిఐపై ఎఫ్ఐఆర్ నమోదైంది. గత మూడు నెలలకు పైగా మణిపూర్‌లో రెండు కమ్యూనిటీల మధ్య నెలకొన్న ఘర్షణలపై ఇజిఐ మీడియా నివేదికను విడుదల చేసింది. మణిపూర్‌లో మరిన్ని హింసాత్మక పరిస్థితులకు దారితీసేలా ఈ నివేదిక ఉందంటూ... ఇజిఐపై కేసు నమోదు చేయాల్సిందిగా మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ పోలీసులను ఆదేశించారు. మరోవైపు ఐటి చట్టంలోని 66ఎను సుప్రీంకోర్టు 2015లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సెక్షన్ కింద పౌరులను హింసించడాన్ని నిలిపివేయాలని అన్ని రాష్ట్రాల పోలీసులను హెచ్చరించింది. అయితే మణిపూర్ పోలీసులు ఈ ఆదేశాలను బేఖాతరు చేయడం గమనార్హం. మీడియా స్వేచ్ఛను, ఎడిటోరియల్స్ నాయకత్వ ప్రమాణాలను పెంపొందించేందు 1978లో నెలకొల్పబడిన ఇజిఐ మణిపూర్ హింసాకాండపై ఆదివారం ఓ నివేదికను విడుదల చేసింది. బీరేన్‌సింగ్ ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తోందని, ఇంఫాల్‌లో మీడియా మొత్తం మొయితీ కమ్యూనిటీకి అనుకూలంగా మారిందని పేర్కొంది. మణిపూర్ పోలీసులు, కమాండో విభాగాలు కూడా పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయని నివేదిక తెలిపింది. బహిరంగంగా మొయితీ పక్షం వహించడంతో పాటు ఇంఫాల్ శివార్లలోని కుకీ గ్రామాలపై దాడికి దిగాయని వెల్లడించింది. నేడు పరిపాలన కూడా జాతుల వారీగా విభజించబడిందని పేర్కొంది.

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో కాంగ్రెస్ అధికారంలోకి రానుంది

### - కాంగ్రెస్ నాయకులు రాజా రమేష్ బాబు



**టీ మీడియా, సెప్టెంబర్ 4, రామకృష్ణాపూర్ :** మందమర్రి పట్టణం లోని రైల్వే గేట్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏటూరి సత్యనారాయణకు సంబంధించిన వినాయక విగ్రహ అమ్మకాలను సోమవారం చెన్నూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రాజా రమేష్ బాబు స్థానిక పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ చెన్నూరు గడ్డ పై కాంగ్రెస్ జెండా ఎగరాలని వారం క్రితం కోరెగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం తెల్సిందే, కాంగ్రెస్ పార్టీ అధికారం రావాలని ఆయన సంకల్పంతో చేసిన పూజలకు తోడుగా కాంగ్రెస్ పార్టీ నాయకులమంత పార్టీ గెలుపుకు అహర్నిశలు శ్రమించి సైనికుల్లా పనిచేస్తామని తెలిపారు. చెన్నూరు లో కాంగ్రెస్ జెండా ఎగరేయడం మాత్రమే కాదు దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వచ్చే విధంగా పాటుపడుతాం అని తెలిపారు. ప్రజలు, భక్తులు వినాయక చవితి పండగను శాంతియుత వాతావరణం లో జరుపుకోవాలని, వినాయక విగ్రహ సముదాయం ప్రారంభానికి తమని ఆహ్వానించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఆ తర్వాత పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో పెద్దపెల్లి పార్లమెంట్ ఇంచార్జ్ మోహన్ జోషి ని చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రాజా రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# 16, 17 తేదీలలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలు

### - హైదరాబాద్ వేదికగా



**టీ మీడియా, సెప్టెంబర్ 4, హైదరాబాద్:** వేదికగా ఈ నెల 16, 17వ తేదీల్లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనుంది. 18న పార్టీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా తమ తమ నియోజకవర్గాల్లో ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ సోమవారం వివరాలు వెల్లడించారు. సీడబ్ల్యూసీ ఇటీవలే కొత్తగా కొలువుదీరగా.. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ఇది తొలి భేటీ కావడం విశేషం. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సెప్టెంబరులో హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశం ఏర్పాటు చేయాలని పార్టీ 'ప్రదేశ్ ఎన్నికల కమిటీ' (పీఈసీ) ఇటీవల తీర్మానం చేసింది. తాజాగా సమావేశాల నిర్వహణ తేదీలపై స్పష్టత ఇచ్చింది. 16న సీడబ్ల్యూసీ సభ్యులు భేటీ కానున్నారు. 17న సీడబ్ల్యూసీ సభ్యులతోపాటు అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్లమెంటు సభ్యులు, ఆహ్వానితులు, ముఖ్య నేతల సమావేశం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ సమీపంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని, తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ 'అయిదు గ్యారంటీల'ను ప్రకటిస్తామని వేణుగోపాల్ తెలిపారు. తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పర్యటించే సీడబ్ల్యూసీ సభ్యులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతల ప్రచార ర్యాలీలను కాంగ్రెస్ అధ్యక్షుడు జెండా ఊపి ప్రారంభిస్తారని చెప్పారు. సెప్టెంబర్ 18న స్థానిక బిఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు తమ తమ నియోజకవర్గాల్లో ఇంటింటికీ ప్రచార పర్వం మొదలుపెట్టనున్నట్లు వెల్లడించారు.

## విద్వేష ప్రసంగాలు

### - సిపిఎం నేతల పిటిషన్ వాయిదా వేసిన సుప్రీం



**టీ మీడియా, సెప్టెంబర్ 4, న్యూఢిల్లీ :** ఇద్దరు బిజెపి నేతలపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలన్న సిపిఎం నేత బృందా కారత్ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు వాయిదా వేసింది. అడిషనల్ జనరల్ ఎస్‌వి. రాజు విజ్ఞప్తి మేరకు ఈ కేసును అక్టోబర్ 3 వరకు వాయిదా వేస్తున్నామని జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ పంకజ్ మిథాల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో తదుపరి వాయిదా ఇచ్చేది లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. గత నెల 17న సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసులకు నోటీసులిచ్చారు. విద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించి ఇద్దరు బిజెపి ఎంపిలపై సిపిఎం నేతలు కారత్, కెఎం.తివారీ దాఖలు చేసిన పిటిషన్‌లను గతేడాది జూన్‌లో ఢిల్లీ హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బఅందాకరత్, పార్టీ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారీ పిటిషన్ దాఖలు చేశారు. షహీద్ అబ్దుల్లా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో ఇంప్లీడ్‌మెంట్ పిటిషన్ దాఖలు చేశారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ తదితర సంస్థల నాయకులు ఢిల్లీలోని నాంగ్లోరు, ఘోండా చౌక్‌తోపాటు వివిధ ప్రదేశాల్లో జరిగిన బహిరంగ సభల్లో హిందూ మతం పేరుతో ముస్లిం సమాజంపై ప్రజలను రెచ్చగొట్టారని పిటిషన్‌లో సిపిఎం నేతలు పేర్కొన్నారు. 'హిందూ మతం పేరుతో రాజ్యాంగ విలువలు, లౌకికవాదానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టారు. దేశ రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో ఇటువంటి సమావేశాలు జరుగుతున్నాయి. ముస్లిం సమాజంపై ఆర్థిక, సామాజిక బహిష్కరణకు నిరంతర పిలుపు ఇస్తున్నాయి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## మైనారిటీ బందు చెక్కుల పంపిణీ

### - విద్యా ,సామజిక పరంగా మైనార్టీలను అభివృద్ధి చేసాం

### - ఎమ్మెల్యే సైదిరెడ్డి



**టి మీడియా, సెప్టెంబర్ 4, హుజూర్ నగర్ :** విద్యా, సామాజిక,న్యాయ పరంగా మైనారిటీలను అందుకునే ప్రభుత్వం బి.ఆర్.ఎస్ ప్రభుత్వం అని హుజూర్ నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం హుజూర్ నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా మైనార్టీలకు మంజూరైన లక్ష రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కెసిఆర్ అధికారంలోకి వచ్చిన ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ముస్లింలు విద్య పరంగా సామాజిక ఆత్మగౌరవంతో బతికే విధంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, ముస్లిం పిల్లలు నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్య చదివేందుకు మైనారిటీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి వసతి తో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, ఇండ్లకే పరిమితమైన ముస్లిం ఆడపిల్లలు నేడు ఇంజనీరింగ్ మెడిసిన్ వంటి ఉన్నత విద్యలు అభ్యసిస్తున్నారు. మైనార్టీ ల విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. చదువు సంధ్యలకు దూరమై పలు వృత్తుల్లో ఉన్న ముస్లిం యువకులు నేడు ఉన్నత విద్యల అభ్యసిస్తూ ఆత్మగౌరవంతో బతుకుతున్నారని ఉపాధికి అనేక పథకాలను అమలు చేస్తూ వారి జీవన పరిస్థితుల్లో మార్పులు తెచ్చామన్నారు సంక్షేమం కోసం మసీదుల నిర్మాణానికి షాదీ ఖానాల నిర్మానానికి,ఖబరాస్తా న్ ల నిర్మాణానికి వేల రూపాయల బడ్జెట్ మంజూరు చేశారన్నారు.

## ధామాషా ప్రకారం ముదిరాజ్ లకు టిక్కెట్లు కేటాయించాలి



**టీ మీడియా, సెప్టెంబర్ 4, గోదావరిఖని :** 60 లక్షల జనాభా గల ముదిరాజులను ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్రను ఖండిస్తున్నాం.రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ముదిరాజులకు సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ ముదిరాజ్ జెఎసి డిమాండ్ చేశారు.సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ సంఘాలు చేసి అధికారం ప్రతినిధి ఉప్పం శ్రీనివాస్, ముదిరాజ్ రాష్ట్ర నాయకులు పిడుగు కృష్ణ ముదిరాజ్, నాయిని మధునయ్య ముదిరాజ్, తదితరులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక జనాభా గల ముదిరాజులపై పాలక బిఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు గాను 115 సీట్లకు అభ్యర్థులను ప్రకటించారని అందులో ముదిరాజ్ కులస్తులకు ఒక్క టికెట్ కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 లక్షల జనాభా గల ముదిరాజులు తెలంగాణ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధనకు ముందుండి అగ్ర భాగాన నిలిచారని పోలీస్ కిష్టయ్య లాంటి ఉద్యమకారులు ముదిరాజ్ జాతి బిడ్డలు ఎందరో అమరులయ్యారని గుర్తు చేశారు.ముదిరాజ్ తెలంగాణ ఉద్యమంలో అగ్ర గ్రామీణ నుండి మా ముదిరాజ్ ఆడబిడ్డలు అందరూ కూడా బుట్టి తోపల నెత్తున బోనం పెట్టుకొని ఉద్యమంలో అగ్ర భాగాన పనిచేశారు బి సి డి నుండి బీసీ ఏ కు మార్చాలని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నామని, ఉద్యమనేత కేసిఆర్ సానుకూలంగా వ్యవహరిస్తానని హామీ ఇచ్చి ఇంతవరకు ఆ ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు.జాతి ఐక్యతను దెబ్బతీసే కుట్రలు చేస్తున్న ఏ పార్టీకైనా రానున్న రోజుల్లో గుణపాఠం చెప్తామని ముదిరాజులకు అన్యాయం చేసిన పార్టీలకు నాయకులకు బుద్ధి చెప్పడం తప్పదని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు దామాషా ప్రకారంగా అత్యధిక జనాభా గల ముదిరాజులను గుర్తించి రాజకీయంగా ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు అప్పరాజు ప్రభాకర్, నూనె రాజేశం బర్ల మల్లయ్య,తూడి రాజయ్య, పిట్టల హనుమాన్లు,రావుల స్వరాజ్, పిట్టల కొమురయ్య, అయిలవేన రాజేందర్,గొడుగు రవి,ఓదల రామస్వామి, చొప్పరి రాయమల్లు,పిట్టల ఇస్తారు,మంద శ్రీనివాస్,పిట్టల కొమురయ్య, కనుకుంట్ల నరసయ్య, జెట్టి రాములు, దెబ్బట శంకర్,పోలు కుమార్,బోల లక్ష్మీనారాయణ, పిట్టల మధు, ఈరవేనా సంపత్, చిగురు సాయి ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## టెలికాం వినియోగదారులకు అవగాహన సదస్సు

**టీ మీడియా, సెప్టెంబర్ 4, గోదావరిఖని :** గాయత్రి డిగ్రీ కళాశాల, పెద్దపల్లి పట్టణం,పెద్దపల్లి జిల్లా, తెలంగాణ రాష్ట్రం నందు టెలికాం వినియోగాదారులకు సెప్టెంబర్ 7 న అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నాము అని ట్రాయ్ కాగ్ తెలంగాణా రాష్ట్ర సభ్యురాలు కల్లెపు శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెలికాం వినియోగదారుల హక్కులు, వారి ప్రయోజనాలు కాపాడేందుకు భారత టెలికాం ప్రాధికారత సంస్థ ప్రధాన భూమిక పోషిస్తుంది. గురువారం రోజున మధ్యాహ్నం 2-30 గంటలకు సెప్టెంబర్ 7 న గాయత్రి డిగ్రీ కళాశాల,పెద్దపల్లి పట్టణం, పెద్దపల్లి జిల్లా, తెలంగాణ రాష్ట్రం నందు వివిధ టెలికాం సెల్యులార్ సంస్థల ప్రతినిధులతో అవాహగన సదస్సు ఉంటుంది.ఈ సందర్భంగా వినియోగదారులు వివిధ టెలికాం సంబదిత సందేశాల నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థ బి.ఎస్.ఎన్.ఎల్ తో పాటు ఎయిర్ టెల్, ఓడాఫోన్, రిలియన్స్, జీయో,ఐడియా మరియు తదితర సంస్థల సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఎవరికీ పిర్యాదులు చేయాలనే అంశాలపై సదస్సు నిర్వహిస్తున్నాము అని అన్నారు. ఈ సదావకశాన్ని ప్రతి ఒక్క టెలికాం వినియోగదారులు, విద్యార్థులు, ఎన్.జి.ఓ ప్రముకులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ తమ సందేహాలను నివృత్తి చేసుకొని మరిన్ని నాణ్యమైన సేవలు పొందే ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు అని ఆమే తెలిపారు.

## ప్రతి గ్రామానికి రఘు అన్న సేవా కార్యక్రమాలు

### - దశ దిన కార్యక్రమాలకు రఘు అన్న ఆర్థిక సహాయం



**టి మీడియా, సెప్టెంబర్ 4, మేళ్ళ చెరువు :** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం మెల్ల చెరువు మండల కేంద్రంలో అన్నారోగ్యం తో ఇటీవల మరణించిన చేగుండి లింగరాజు కుటుంబానికి ఓజో ఫౌండేషన్ సభ్యుల ద్వారా ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు సోమవారం 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. మేళ్లచెరువు లోని దేవాలయాలకు, నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆడబిడ్డ పెళ్లిలకి, దశదిన కార్య క్రమాలకు రఘు అన్న ఆర్థిక సహాయం అందించాడని, రాబోయే రోజుల్లో రఘు అన్న లాంటి యువ నాయకుడు ని గెలిపించుకుని, మా సమస్యలు రఘు అన్న ద్వారా పరిష్కరించుకుంటాం అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెల్ల చెరువు ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పారిశుద్ధ్యం పాటించాలి

### - మున్సిపల్ కమిషనర్



**టి మీడియా, సెప్టెంబర్ 4, హుజూర్ నగర్ :** పరిసరాల పారిశుద్ధ్యన్ని పాటించాలని హుజూర్నగర్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. హుజూర్నగర్ మున్సిపాలిటీ పరిధిలో పబ్లిక్ క్లబ్ వెనక డెంగ్యూ కేసు నమోదు కావడంతో వైద్య , ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి డ్రైడే , దోమ లార్వా నిర్మూలనకు డై ఫ్లూ బెంజిరన్ స్ప్రే చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పారిశుద్ధ్యం ద్వారా ప్రజలు మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు.ఇంటి చుట్టుపక్కల నీటి నిల్వలు ఉన్న ఎడల దోమల వ్యాప్తి జరిగి మలేరియా, డెంగ్యూ , బోదకాలు, మెదడు వాపు వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, ఇంటి చుట్టు పక్కల కుండలు, టైర్లు ,జాడీలు డిస్పోజల్ గ్లాస్ లేకుండా చూడాలని వారానికి ఒకరోజు డ్రై డే పాటించి నీటి తొట్లు, డ్రమ్ములు , ఓవర్హెడ్ ట్యాంకులను కడిగి ఆరబెట్టాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, లలిత ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలు, మండలాల అధికారులతో సమీక్ష సమావేశం

### - ఎమ్మెల్యే బాల్క సుమన్



**టీ మీడియా, సెప్టెంబర్ 4, రామకృష్ణాపూర్ :** చెన్నూరు నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మంచిర్యాల జిల్లా ఐడిఓసి కార్యాలయంలో సోమవారం మున్సిపాలిటీలు, మండలాల వారీగా అధికారులతో సమీక్షించిన ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్.ఈ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్లు, ఏఈఈ లు, మిషన్ భగీరథ, ఆర్&బి, పంచాయతీరాజ్ వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 10, 11 తేదీలలో ముత్యాలమ్మ జాతర



టి మీడియా, సెప్టెంబర్ 4, హుజూర్ నగర్ : సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ : పట్టణంలో ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో నిర్వహించే ముత్యాలమ్మ జాతర ఈనెల 10(ఆదివారం), 11(సోమవారం) తేదీల్లో జరపాలని సోమవారం ముత్యాలమ్మ జాతర కమిటీ నిర్ణయించింది. ఈ నెల 7(గురువారం) పట్టణంలో సల్లకుండ ఎత్తే కార్యక్రమం ద్వారా జాతర ప్రారంభమై, 10 ఆదివారం పెద్ద ముత్యాలమ్మ తల్లికి, 11 సోమవారం చిన్న ముత్యాలమ్మ తల్లికి, 14న గురువారం కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలందరూ ముత్యాలమ్మ జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

## ఉత్తమన్నకు శుభాకాంక్షలు తెలిపిన దామన్న



**టి మీడియా, సెప్టెంబర్ 4, హుజూర్ నగర్ :** ఏఐసీసీ కీలక కమిటీ సెంట్రల్ ఎలెక్షన్ కమిటీలో సభ్యులుగా నియమితులైన సందర్భంగా నల్లగొండ పార్లమెంట్ సభ్యులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ ,పిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి,,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి  శుభాకాంక్షలు తెలియజేశారు.

## వర్షాలు కురవాలని శివాలయంలో విశేష పూజలు



**టి మీడియా, సెప్టెంబర్ 4, మేళ్ళ చెరువు :** వర్షాలు కురవాలని శివాలయంలో స్వామి వారికి విశేష పూజలు గ్రామ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొంక పాక ధనుంజయ శర్మ, శివ విష్ణు వర్ధన్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి, మహా నివేదన మంగళ నీరాజ మంత్ర పుష్పములు వంటి విశేష పూజలు నిర్వహించారు. తదానంతరం, భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో  ఆలయ కార్యనిర్వాహణాధికారి గుజ్జుల కొండారెడ్డి, పందిళ్ళ పల్లి శంకర్ రెడ్డి, రేనివేషన్ కమిటీ చైర్మన్ వజ్ర వెంకటరెడ్డి , అర్చకులు, కొంకపాక శివ విష్ణువర్ధన్ శర్మ, శివధనుంజయ శర్మ ,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. సోమవారం మహా పర్వదినం కావడంతో కందిబండ గ్రామానికి చెందిన భక్తురాలు అన్న దానం వితరణ చేశారు.

# భగ్గుమంటున్న నిత్యావసర ధరలు

## - హడలిపోతున్న జనాలు



**టీ మీడియా, సెప్టెంబర్ 4,డిల్లీ :**ఇటీవల టమాటా ధరలు రైతులకు కాసులు వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తాజాగా టమాటాతో సహా మిగతా కూరగాయల ధరలు కూడా సాధారణ స్థితికి వచ్చేశాయి. అయితే ప్రస్తుతం కందిపప్పు, బియ్యం వంటి నిత్యావసర ధరలు మండిపోతున్నాయి. అలాగే జీలకర్ర, పాలు వంటి ధరల పెరుగుదల చూసి ప్రజలు హడలిపోతున్నారు. ఇలా నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడం వల్ల ఐదు వేళ్ళ నోట్లోకి వెళ్లేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు. వేసవి కాలంలో అకాల వర్షాలు పడిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వర్షాభావ పరిస్థితులు పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిన సంగతి అందరికి తెలిసిందే. అయితే ఈ కారణం వల్లే ధరలు మండిపోతున్నాయని వర్తకులు చెబుతున్నారు. అలాగే ప్రొటీన్ ఎక్కువగా లభించే కందిపప్పును కూడా తెలుగు ప్రజలు ప్రతిరోజూ వినియోగిస్తుంటారు. ప్రస్తుతం కందిపప్పు కిలో ధర ఆరు నెలల్లోనే దాదాపు 50 శాతం పెరిగిపోయింది. వాస్తవానికి ఫిబ్రవరిలో 110 రూపాయల నుంచి 120 రూపాయలు ఉంది. అయితే ఇప్పుడు మాత్రం 170 రూపాయలకు చేరింది.ఇక్కడ మరో విషయం ఏంటంటే తెలంగాణకు మహారాష్ట్ర నుంచి అధికంగా కందిపప్పు వస్తుంది. అయితే అక్కడ వర్షాలు పడలేదు.దీంతో దిగుబడి తగ్గిందని హైదరాబాద్ మలక్‌పేట్ మార్కెట్‌లో ఉన్న వర్తకులు అంటున్నారు. దీనివల్ల సామాన్య ప్రజలు కందిపప్పుకు ప్రత్యామ్నాయంగా పెసర, ఎర్రపప్పులను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మినుప పప్పు ధరల కిలోకు 110 రూపాయల నుంచి 130 రూపాయలకు పెరిగిపోయింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం జీలకర్ర 700 రూపాయలకు పైగా పలుకుతోంది. అయితే అయిదారు నెలల క్రితం చూసుకుంటే దీని ధర 300 రూపాయల లోపే ఉండేంది. అలాగే సెనగపప్పు ధర 65 రూపాయల నుంచి 75-80 రూపాయలకు ఎగబాకింది. పాలు లీటర్‌కు ఏకంగా ఐదు రూపాయల చొప్పున పెంచేశారు. నాణ్యమైనవి చూసుకుంటే 80 రూపాయల నుంచి 100 రూపాయల వరకు ధర పలుకుతోంది.ఇక చింతపండు చూసుకుంటే ఇది కిలోకు 120 నుంచి 150 రూపాయలకు చేరిపోయింది. మరో విషయం ఏంటంటే గ్రామీణ ప్రాంతాల్లో చింతచెట్లు గతంలో చాలా ఉండేవి. కానీ ఇప్పుడు అంతగా లేకపోవడం అలాగే కోతుల సమస్యల వల్ల కూడా వాటిని కొట్టేస్తున్నారు. దీనివల్ల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోతోంది. ఇక వంట నూనెలు, అల్లం వెల్లుల్లి ధరలు మాత్రం ప్రజలకు కాస్త ఉపశమనంగా ఉంది. వారం రోజుల క్రితం చూసుకుంటే అల్లం వెల్లుల్లి పేస్టు కిలో 280 రూపాయలు పలికింది. అయితే ఇప్పుడు మాత్రం180 రూపాయలకు దిగివచ్చింది. 2019లో లీటర్‌కు 90 రూపాయలు ఉన్న మంచినూనె ధర.. ఆ తర్వాత 190 రూపాయలకు వెళ్లిన సందర్భం ఉంది. ప్రస్తుతం దీన్ని కిలోకు 110 రూపాలకు విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా బియ్యం ధరలు కూడా గణనీయంగా పెరిగిపోతున్నాయి. 25 కిలోలు ఉన్న సన్నబియ్యం బస్తా 1250 రూపాయల నుంచి 1500 రూపాయలకు పెరిగిపోయింది. నాణ్యమైనవి కిలో 54 రూపాయల 64 రూపాయలకు పెరిగిపోయాయి. అకాల వర్షాల వల్ల పంట నష్టం.. అలాగే రైతుల దొడ్డు రకం వరి సాగుకే ప్రాధాన్యమివ్వడం వంటి అంశాలే ఈ పెరుగుదలకు కారణాలుగా కనిపిస్తున్నాయి.

## టీచర్లకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి శుభాకాంక్షలు



**టీ మీడియా, సెప్టెంబర్ 4,హైదరాబాద్,  :** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. భవిష్యత్తును ఇచ్చేది గురువేనని పేర్కొన్నారు. పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయులు గురుతర భాధ్యతను నిర్వహిస్తున్నారని మంత్రి కొనియాడారు. విద్య ద్వారానే మానవ వనరులు అభివృద్ధి చెందుతాయని, తద్వారా బంగారు తెలంగాణ సాధించవచ్చనే గొప్ప లక్ష్యంతో సీఎం కేసీఆర్ తెలంగాణలో విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యధిక గురుకులాలు పెట్టి, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. కాగా,  ఉపాధ్యాయ  దినోత్సవం సందర్భంగా మంగళవారం ( సెప్టెంబర్ 5వ తేదీన ) తెలంగాణ ప్రభుత్వం గురుపూజోత్సవం నిర్వహించనుంది. రవీంద్రభారతిలో ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 125 మంది టీచర్లు, అధ్యాపకులు, ఆచార్యులను ఘనంగా సత్కరించనున్నారు.

## భూ సర్వేయర్లకు ఫోన్ చేసి బెదిరింపులు

# నకిలీ ఏసీబీ అధికారి అరెస్ట్



**టీ మీడియా, సెప్టెంబర్ 4,వరంగల్:** ఏసీబీ అధికారినని చెప్పుకొంటూ ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం నిందితుడిని వరంగల్ జిల్లా నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌లో మీడియా ముందు చూపి, ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కనపర్తికి చెందిన పత్తి శ్రీనివాస్‌రెడ్డి ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. వరంగల్ జిల్లాలోని పర్వతగిరి, నెక్కొండ, నల్లబెల్లి మండలాలకు చెందిన భూ సర్వేయర్లు శామ్యూల్, మల్లయ్య, కుశాల్‌కు ఫోన్ చేసి తాను ఏసీబీ అధికారినని చెప్పుకున్నారు.భూముల సర్వే విషయంలో రైతుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమకు కైంప్లెంట్ వచ్చిందని బెదిరించాడు. బయటపడాలంటే రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లించాలని చెప్పాడు. దీంతో సర్వేయర్లు కుశాల్ రూ.5వేలు, మల్లయ్య రూ.2వేలు అతడి ఖాతాకు ఫోన్‌పే ద్వారా పంపి నమ్మించే ప్రయత్నించారు. ఆ తర్వాత సర్వేయర్ మల్లయ్య నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన ఎస్సై నగేశ్ చాకచక్యంగా వ్యవహరించారు. మిగతా డబ్బులు ఇస్తానంటూ మల్లయ్యతో నిందితుడికి ఫోన్ చేయించారు. దీంతో డబ్బులు తీసుకునేందుకు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఉదయం హనుమకొండ నుంచి బయల్దేరి మండలంలోని శనిగరం క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకోగా, పథకం ప్రకారం అక్కడే తన సిబ్బందితో మఫ్టీలో ఉన్న ఎస్సై అదుపులోకి తీసుకున్నారు.

విచారించగా అతడిపై కరీంనగర్, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, విజయవాడ పోలీస్‌స్టేషన్లలో పలు నేరాల కింద 16 కేసులు నమోదైనట్లు డీసీపీ తెలిపారు. ఈమేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని నేరాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతామని ఈస్ట్‌జోన్ డీసీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఏసీపీ తిరుమల్, సీఐ కిషన్, నల్లబెల్లి ఎస్సై నైనాల నగేశ్ పాల్గొన్నారు.

# నూతన రెవెన్యూ డివిజన్‌గా చండూరు

### - ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**టీ మీడియా, సెప్టెంబర్ 4,చండూరు:** నల్లగొండ జిల్లాలోని చండూరు మండలం నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడింది. చండూరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా గతంలో చండూరులో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తూ చండూరును రెవెన్యూ డివిజన్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు.సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఇప్పుడు చండూరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తూ జీవో విడుదల చేసింది. కాగా, ప్రస్తుతం చండూరు మండలం నల్లగొండ జిల్లాలోని నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లో భాగంగా ఉంది. ఇప్పుడు ప్రభుత్వం చండూరును నూతన రెవెన్యూ డివిజన్‌గా మార్చి.. అందులో నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లోని చండూరు, మునుగోడు, గట్టుప్పల్ మండలాలను, దేవరకొండ రెవెన్యూ డివిజన్‌లోని నాంపల్లి, మర్రిగూడ మండలాలను కలిపింది.

## మొదటి రోజు

# 182 దరఖాస్తులు

### - వారి అప్లికేషన్లు పక్కనపెట్టాలి
### - కిషన్ రెడ్డి హుకూం..




**టీ మీడియా, సెప్టెంబర్ 4,హైదరాబాద్, :** తెలంగాణలో ఎన్నికల హీట్ పెరిగింది. ఓవైపు జమిలి ఎన్నికలపై చర్చ జోరుగా సాగుతున్నా.. మరోవైపు ఎప్పుడైనా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు రావొచ్చు అనే ఉత్కంఠ నెలకొంది. ఇక, ఒకేసారి 115 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి మరింత హీట్ పెంచారు సీఎం కేసీఆర్. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలు పెట్టి, దరఖాస్తుల స్వీకరించింది. పోటీపడుతున్న ఆశావహుల పరిస్థితులను బేరీజు వేసి లిస్టు రెడీ చేసింది. ఇక కమలం పార్టీ కూడా అభ్యర్థుల ఎంపిక కోసం ఇదే విధానాన్ని అనుసరిస్తోంది. నాంపల్లి బీజేపీ ఆఫీసులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, దరఖాస్తులను స్వీకరిస్తోందినాంపల్లి బీజేపీ ఆఫీసులో ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకూ దరఖాస్తులను తొలిరోజు స్వీకరించారు. సికింద్రాబాద్ నుంచి రవి ప్రసాద్ తొలి దరఖాస్తును అందజేశారు. కౌంటర్ ఇంచార్జ్‌లు మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి, GHMC మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్, మల్లేష్ ఉన్నారు. మొత్తం 63 మంది ఆశావాహులు మొత్తం 182 దరఖాస్తులను దాఖలు చేశారు. ఒక్కో అభ్యర్థి రెండు, మూడు నియోజకవర్గాలకు దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది..

**10వ తేదీతో  గడువు ముగింపు**

దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 10వ తేదీతో గడువు ముగియనుంది. ఇప్పటివరకు 300 మందికి దరఖాస్తులు పంపిణీ చేశారు. తొలి దరఖాస్తును సికింద్రాబాద్ నుంచి రవి ప్రసాద్‌గౌడ్ అందజేశారు. సామ రంగారెడ్డి ఎల్బీనగర్ నుంచి అప్లై చేయగా, వేములవాడ నుంచి తుల ఉమ అభ్యర్థిగా దరఖాస్తు చేశారు.

# అన్ని కులవృత్తులకు చేయూత

### - మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**టి మీడియా, సెప్టెంబర్ 4,మహబూబ్‌నగర్ :** రాష్ట్రంలోని అన్ని కులవృత్తులకు సీఎం కేసీఆర్ చేయూత నిస్తున్నారని క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి హాజరై 300 మంది లబ్ధిదారులకు బీసీబంధు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదట అత్యంత వెనుకబాటుకు గురైన పేద దళితుల ఆర్థికాభివృద్ధి కోసం దళితబంధు తీసుకొచ్చామని తెలిపారు. తర్వాత పేద, బలహీన వర్గాలకు అండగా ఉండేందుకు బీసీబంధు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు ఏదో రూపంలో అందుతున్నాయని తెలిపారు. చేతివృత్తులు కనుమరుగైతే మానవ మనుగడే లేదన్నారు. సమైక్య రాష్ట్రంలో మరుగున పడిన కులవృత్తులకు తెలంగాణ ప్రభుత్వం చేయూతనిస్తూ వారిని ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకొస్తున్నట్లు వివరించారు.దళిత, బీసీ బంధు నిరంతరకొనసాగుతూనే ఉంటుందని, విడుతల వారీగా అగ్రవర్ణ పేదలకూ వర్తింపజేస్తామని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డ్రైరన్ విజయవంతం కావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. త్వరలో ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేసి వచ్చే యాసంగి నాటికి మూడున్నర లక్షల ఎకరాల్లో పారించి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని స్పష్టం చేశారు. అలాగే మహబూబ్‌నగర్‌లోని ట్యాంక్‌బండ్‌పై రూ.14 కోట్లతో నిర్మించిన సస్పెన్షన్ బ్రిడ్జి ప్రారంభోత్సవంపై హైదరాబాద్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమావేశం నిర్వహించారు.ట్యాంక్‌బండ్, నెక్లస్ రోడ్డు, సస్పెన్షన్ బ్రిడ్జి, శిల్పారామం పాలమూరుకు ఐకాన్‌గా మారాయన్నారు. బ్రిడ్జిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పద్మభూషణ్ అవార్డు గ్రహీత, బ్రిడ్జి మెన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన గిరీష్ భరద్వాజ్ స్వయంగా డిజైన్ చేశారని తెలిపారు. ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, టూరిజం ఎండీ మనోహర్, ఓఎస్‌డీ సత్యనారాయణ, కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

## నాలాలో పడి మహిళ గల్లంతు



**టీ మీడియా, సెప్టెంబర్ 4,హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా వానలు దంచికొడుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్ విషాదకర ఘటన చోటుచేసుకుంది. గాంధీనగర్‌లో నాలాలో పడిపోయి ఓ మహిళ గల్లంతయ్యింది. సదరు మహిళను లక్ష్మిగా గుర్తించారు. దీంతో, రంగంలోకి దిగిన జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది గల్లంతైన మహిళ కోసం గాలిస్తున్నారు. నాలుగు బృదాలుగా విడిపోయి మూసీ నదిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ గాలింపు చర్యల్లో 100 మంది డీఆర్‌ఎఫ్ సిబ్బంది పాల్గొని మూసీని జల్లెడ పడుతున్నారు. పది కిలోమీటర్ల మేర డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె కూతురు మీడియాతో మాట్లాడుతూ.. నిన్న మధ్యాహ్నం రెండు గంటల నుంచి మా అమ్మ కనిపించడం లేదు. వర్షం కారణంగానే నాలా ఉప్పొంగి ప్రవహిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందన్నారు.

## బస్సుపై ఏనుగు దాడి..



**టీ మీడియా, సెప్టెంబర్ 4,పార్వతీపురం :** మన్యం జిల్లాలో ఓ ఏనుగు ప్రైవేట్ బస్సుపై సోమవారం దాడి చేసింది. అయితే ఈ సమయంలో బస్సు నుంచి ప్రయాణీకులు దిగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రారు ఘడ్ నుంచి పార్వతీపురం వెళ్తున్న ప్రైవేట్ బస్సుపై ఏనుగు దాడి చేసింది. కొమరాడ మండలం అర్థం అంతర్ రాష్ట్ర రహదారిపై ఏనుగు బీభత్సం సష్టించింది. రోడ్డుపైకి వచ్చిన ఏనుగును గమనించిన బస్సు డ్రైవర్ బస్సును రోడ్డుపై నిలిపివేశారు. బస్సు నుంచి ప్రయాణీకులు దిగిపోయారు. రోడ్డుపై నిలిచిపోయిన బస్సును ఏనుగు తన తొండంతో దాడి చేసింది. దీంతో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. బస్సును ఏనుగు వెనక్కి నెట్టివేసింది. దీంతో ఈ బస్సులోని ప్రయాణీకులు భయంతో కేకలు వేశారు. రోడ్డు పక్కనే ఉన్న ఓ భవనంపై కూడ ఏనుగు దాడికి దిగింది. ఏనుగు ఈ రోడ్డుపై నానా హంగామా చేయడంతో రోడ్డుపైనే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అదేవిధంగా పంటపొలాలను సైతం దాడి చేసింది. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమిక్షించారు. మంద నుండి ఏనుగు తప్పిపోయినట్టుగా అటవీ శాఖాధికారులు అనుమానిస్తునారు.

## శ్రీరాంసాగర్, నిజాం సాగర్ ప్రాజెక్టులకు పోటెత్తిన వరద



**టీ మీడియా, సెప్టెంబర్ 4,నిజామాబాద్:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్, నిజాం సాగర్ ప్రాజెక్టుల్లోకి వరద పోటెత్తింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పెరగడంతో అధికారులు 4 గేట్ల ద్వారా గోదావరి నదిలోకి 12 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.8 అడుగులకు చేరింది. ఇక నిజాం సాగర్ ప్రాజెక్టులోకి వరద భారీగా చేరుతోంది. ప్రాజెక్టులోకి 2500 క్యూసెక్కుల నీరు వస్తున్నది. దీంతో జలాశయంలో నీటిమట్టం 1,403.7 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు. నిజాం సాగర్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, ఇప్పుడు 16 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

## పెళ్లయిన రెండో రోజే కరెంట్ షాక్‌తో నవవరుడు మృతి



**టీ మీడియా, సెప్టెంబర్ 4,సిద్ధిపేట:** జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పెళ్లి జరిగిన రెండో రోజే నవవరుడు కరెంట్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయాడు. వివరాల్లోకి వెళితే.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన నిరంజన్ అనే యువకుడు ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. జీవితంలో స్థిరపడటంతో ఓ మంచి అమ్మాయితో తల్లిదండ్రులు పెళ్లి చేశారు. శనివారం అంగరంగ వైభవంగా నిరంజన్ పెళ్లి జరిగింది. బంధువులు, స్నేహితులతో ఇళ్లు కళకళలాడుతోంది. సోమవారం రిసెప్షన్‌కు కూడా ఏర్పాట్లు చేశారు. అంతా ఈ కార్యక్రమానికి రెడీ అవుతుండగా ఊహించని ప్రమాదం జరిగింది. వరుడు కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే నిరంజన్ మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పెళ్ల జరిగిన రెండో రోజే ఇలా జరగడంతో గ్రామంలోనూ విషాద ఛాయలు చోటు చేసుకున్నాయి. అటు నవ వధువు కుటుంబం కూడా షాక్‌కు గురైంది. కాళ్ల పారాణి ఆరక ముందే ఈ విషాదం చోటు చేసుకోవడంతో ఆమెను ఓదార్చడం ఎవ్వరితరం కావడం లేదు.